క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యపరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని జాజి తండా అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఏఎ న్‌ఎం రేణుక గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్ల లకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవసరం ఉన్నవారికి వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చారు. రక్తహీనత నివారణ కోసం ఆహారంలో ఆకుకూరలు, పాలు, కోడిగుడ్లు తినాలని చెప్పారు. అంగ న్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పోషకాహారాన్ని సద్వి నియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో అంగన్‌వాడీ టీచర్ సునీత, ఆశ వర్కర్లు నర్సమ్మ, మమత, మహిళలు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో నేడు రక్తదానం

రామాయంపేట(మెదక్): పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఆదివారం తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు విధిగా హాజరు కావాలని సూచించారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని భుజిరంపేట గ్రామ ఉపసర్పంచ్ సాయిలు, మండల బీఆర్‌ఎస్ ఉపాధ్యక్షుడు గోపాల్‌తో పాటు పలువురు గ్రామస్తులు బీఆర్‌ఎస్ నుం చి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం కౌడిప ల్లిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుముల సుహాసినిరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన భుజిరంపేట ఉపసర్పంచ్ సాయిలు, గోపాల్‌తో పాటు మధు, విఠల్, లక్ష్మయ్య, ప్రభాకర్, గణేశ్, అనీల్, శ్రీకాంత్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో భుజిరంపేట మాజీ సర్పంచ్ లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు కృష్ణాగౌడ్, మధుసూదన్‌రెడ్డి తది తరులు పాల్గొన్నారు.

పోలీసు బలగాల కవాతు



టేక్మాల్‌లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

టేక్మాల్(మెదక్): సార్వత్రిక ఎన్నికల సంద ర్భంగా మండల కేంద్రం టేక్మాల్, ఎల్లుపేట, ధనూర, పల్వంచ, కాద్లూర్ గ్రామాల్లో శనివారం పోలీసుల బలగాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లాదుర్గం జార్జ్ మాట్లాడుతూ... ఎన్నికల్లో ఎవరైనా ప్రలో బాలకు గురిచేస్తే తమ దృష్టికి తీసుకురావాల న్నారు.

అల్లాదుర్గంలో..

మండల కేంద్రం అల్లాదుర్గంలో సీఐ జార్జ్, ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డిలు పోలీస్ ఫోర్స్‌తో శనివారం కవాతు నిర్వహించారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో మాక్‌పోలింగ్



ఓటు వేస్తున్న విద్యార్థులు

పాపన్నపేట(మెదక్): మండల కేంద్రం పాపన్న పేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ని కలు, ఈవీఎంలు, ఓటింగ్, ఫలితాల గురించి వివరించారు. నలుగురు విద్యార్థులు ఎన్నికల పోటీలో ఉండగా 100 మంది విద్యార్థులు ఓట్లు వేసి ఫలితాలను ప్రకటించారు. ఈ కార్య క్రమంలో సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు నరేందర్, యశోదలు నిర్వహించగా ప్రధానో పాధ్యాయుడు మహేశ్వర్‌తో పాటు ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

డంప్‌యార్డు పొగతో తీవ్ర ఇబ్బందులు

తూప్రాన్: మున్సిపాలిటీ పరిధిలో పదో వార్డు బ్రాహ్మణపల్లి వెంకటాపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన డంప్‌యార్డ్‌లోని చెత్తను కాల్చారు. దీంతో వస్తున్న దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పరిసర గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డంప్‌యార్డుకు ఎలాంటి రక్షణ కాంపౌండ్ వాల్, కంచె లేకుండా డంప్ చేస్తూ, బయట చెత్త దంపు చేస్తున్నారని తెలిపారు. చెత్తను మున్సిపల్ సిబ్బంది కాల్చివేయడంతో పొగ గ్రామాల్లోకి వచ్చి ప్రజలకు ఇబ్బందిగా మారిం ది. అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయాల్లో విశేష పూజలు



శివ్వంపేట(నర్సాపూర్): హోమం చేస్తున్న వేద పండితులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వం పేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంలో శని వారం విశేష పూజలు నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వ రశర్మ అమ్మవారికి అభిషేకం, విశేష పూజలతో పాటు హోమం కూడా చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. గూడూర్ వాసి హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, సర్పంచ్ శ్రీనివా స్‌గౌడ్, ఉపసర్పంచ్ పద్మ తదితరులు ఉన్నారు.

దత్తాత్రేయుడికి ప్రత్యేక పూజలు

మనోహరాబాద్(తూప్రాన్): పౌర్ణమిని పురస్కరిం చుకొని మండలంలోని కాళ్లకల్ గ్రామ శివారులోని దత్తాత్రేయ దేవాలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయుడికి పూలతో ప్రత్యేకంగా అలంకరిం చారు. అనంతరం దేవాలయం వద్ద అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో చుట్టు పక్కల గ్రామాల భక్తులు, నాయకులు నత్తి మల్లేశ్, సత్యనారాయణ, బాల్‌రాజ్, దాచారం రాజు, ప్రేమ్, నాగరాజు, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

గురు దర్శనం మోక్షదాయకం

చిన్నశంకరంపేట(మెదక్): సాధు దర్శనం పాపనాశ నమని, గురు దర్శనం మోక్షదాయకమని చిన్నశంక రంపేట శ్రీజీవ బ్రహ్మైక్య వేదాంత రాజయోగాశ్రమ అనంత పద్మనాభస్వామి గుట్ట మహరాజ్ జ్ఞానేశ్వర్ మహరాజ్ పేర్కొన్నారు. శనివారం అచల బోధానం ద సద్గురు యోగీశ్వర భూమినాథం మహరాజ్ అష్టమ ఆరాధన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సద్గురు భూమి నాథ్ మహరాజ్ బోధనలు ఆదర్శనీయమన్నారు. ఈ మేరకు భూమినాథ్ మహరాజ్ విగ్రహానికి క్షీరాభి షేకం నిర్వహించి పూజలు నిర్వహించారు. అనం తరం వేద పండితుడు సంగమేశ్వరశాస్త్రి ఆధ్వర్యం లో కామధేనువు హోమం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం నిర్వహించారు. ఈ ఆరాధనోత్సవం లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



మనోహరాబాద్(తూప్రాన్): ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



ఆలయంలో భక్తులు

బీసీలంతా.. బీజేపీ వైపే



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): గజ్వేల్‌లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఈటల రాజేందర్ పోటీ చేయ డంతో బీసీలంతా ఈసారి బీజేపీ వైపే ఓటు వేసి గెలిపించనున్నారని జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ అన్నారు. శనివారం మనోహరాబాద్ మండల కేంద్రంలో ప్రచారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. పలు గ్రామాల నుంచి యువకులు భారీగా పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, సింగం శ్రీకాంత్, మండల ఉపాధ్యక్షుడు నరేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బీజేపీలో చేరికలు

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామా లకు చెందిన ఉపసర్పంచ్‌లు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో శనివారం బీజేపీలో చేరారు. ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గిరిగౌడ్‌తో పాటు ఆయా గ్రామాల ఉపసర్పంచ్‌లు భూపతి, మల్లేశం, గాంగారెడ్డి, స్వామి, స్వామిగౌడ్, స్వామియాదవ్, రమేశ్ బక్కన ఎల్లవ్వ తదితరులు బీజేపీలో చేరిన వారిలో ఉన్నారు. కిష్టాపూర్‌లో ఏర్పాటు చేసిన మహిళా సదస్సులో గ్రామ సమస్యలను చర్చించారు. గ్రామ సమస్యలు పరిష్కరించినందుకు కిష్టాపూర్ గ్రామస్తులు రఘు నందన్‌రావును గెలిపిస్తామని తీర్మానించారు. అనం తరం రెడ్డిపల్లి గౌడ సంఘం నాయకులు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, వైస్ ఎంపీపీ రాం చంద్రం, మాజీ సర్పంచ్‌లు బాలచందర్, రఘువీర్ రావు, జగన్‌గౌడ్, స్వామి, నాగభూషణం జిల్లా నాయకులు వెంగళ్‌రావు, నర్సింహారెడ్డి, చిన్నశి వునూర్, బోనాల్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరిన ఉపసర్పంచ్‌లు

నేడు మనోహరాబాద్‌లో ఉచిత మెడికల్ క్యాంప్

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రం మనోహరాబాద్‌లో ఇమాంపూరం యాదగిరి జ్ఞాపకార్థం ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహి స్తున్నట్లు వైద్యుడు పాండుగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడు తూ.. ప్రముఖ వైద్యులతో కలిసి చుట్టు పక్కల గ్రామాల వాళ్లకు ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వ హించనున్నట్లు తెలిపారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నరాల వ్యాధులు, ఆస్తమా, టీబీ, దగ్గు, దమ్ము, కీళ్ళ నొప్పులు, మధుమేహం, బీపీ, జ్వరాలు తది తర వాటికి పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు.

శోకసంద్రంలో బాలిక



కన్నీటి పర్యంతమవుతున్న బాలిక

చిన్నశంకరంపేట(మెదక్): ఏడాదికాలంలోనే తల్లితండ్రులను కోల్పోయి ఆనాథగా మారిన బాలిక కన్నీరు మున్నీరైన సంఘటన మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో నెలకొంది. ఖాజాపూర్ గ్రామానికి చెందిన బాప్పల్లి బాబు, ఎల్లమ్మ లకు ఏకై క కూతురు నిఖిత. ఏడాది క్రితం అనారోగ్య సమస్యతో బాబు మృతి చెందాడు. తాజాగా అతడి భార్య కూడా శనివారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అనారోగ్య సమస్యతో మృతి చెందింది. దీంతో బాలిక ఒంటరిదైంది. తల్లిదండ్రులను కోల్పోయిన బాలిక రోదించడంతో గ్రామస్తులను కలచివే సింది. బాలికకు భరోసా కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఎంఎస్ఎన్ ఉద్యోగులకు గాయాలు

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు గాయాలైన సంఘటన మండ లంలోని పొలంపల్లి శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చందం పేట శివారులోని ఎంఎస్ఎన్ ఫార్మా పరిశ్ర మలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు విధులు ముగించుకొని స్కూటీపై చేగుంట వైపుకు వస్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న కారు స్కూటీని ఢీకొట్టగా రాధిక, సంధ్య, ఝాన్సీలకు గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న పరిశ్రమ నిర్వాహ కులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్ప త్రికి తరలించారు. స్కూటీపై వెళ్తున్న మహి ళలకు స్వల్ప గాయాలనట్లు వైద్యులు తెలి పారు.

చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించుకుంటాం

చేగుంట(తూప్రాన్): దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించుకుంటామని మండల శాఖ అధ్యక్షుడు నవీన్ అన్నారు. దుబ్బాక అభ్యర్థిగా చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి అధి ష్ఠానం టికెట్ ఇవ్వడంపై చేగుంటలో సం బరాలు జరుపుకున్న అనంతరం మాట్లాడారు. దివంగత నేత ముత్యంరెడ్డి తనయుడిగా కాం గ్రెస్ పార్టీ తరఫున బరిలో ఉన్నందున ఆయన గెలుపు కోసం పని చేస్తామన్నారు. ఈ సమావే శంలో శ్రీనివాస్, అంజనేయులు, స్టాలిన్, సాయికుమార్‌గౌడ్, మహేశ్, రాజు, సాయి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్న పార్టీలు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని బీజేపీ కార్యకర్తలను తమ పార్టీల్లో చేరాలని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని బీజేపీ మండలాధ్యక్షుడు పోగుల రాజు ఆరోపిం చారు. శనివారం చిన్నశంకరంపేటలో విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలను బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల్లో చేరాలని ఒత్తిడి పెరుగు తున్నట్లు తెలిపారు. బీజేపీ కార్యకర్తల జోలికొస్తే చూస్తూ ఉరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శ దశరథం, ఆకుల రాజు, మంజుల, శ్రీనివాస్, మధు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



వెల్దుర్తిలో నినాదాలు చేస్తున్న నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాసాయిపేటకు చెం దిన ఆవుల రాజిరెడ్డిని ప్రకటించడంపై ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ప్రధాన కూడలి, చౌరస్తాల వద్ద టపాసులు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. నర్సాపూర్ నియోజకవ ర్గంలో రాజిరెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. వెల్దుర్తిలో నిర్వ హించిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, కృష్ణాగౌడ్, కృష్ణ, మైసయ్య, దుర్గాగౌడ్, మల్లేశం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సి పాలిటీ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను శని వారం మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆమె మున్సిపల్ ఏఈతో కలిసి పోలింగ్ స్టేషన్లలో తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, ఇతర వసతులగురించి ఆరా తీశారు. అవ సరమైన చర్యలు వెంటనే ప్రారంభించాలని ఆమె ఏఈని ఆదేశించారు.

ప్రజలను విడదీస్తున్న బీఆర్‌ఎస్, బీజేపీలు

నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి రాజిరెడ్డి



రాజిరెడ్డిని సన్మానిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

నర్సాపూర్: బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజలను మతాలు, కులాలుగా విడదీస్తున్నాయని నర్సా పూర్ కాంగ్రెస్ అభ్యర్థి రాజిరెడ్డి ఆరోపించారు. రాజిరెడ్డిని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ అభ్యర్థిగా శుక్రవారం రాత్రి ప్రకటించింది. ఈ సందర్భంగా ఆయన శనివారం నర్సాపూర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఆ రెండు పార్టీలు ప్రజలను విడదీసి తమ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నాయన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు తమ పార్టీలో అసమ్మతి నాయకులను పోలీసులతో బెదిరించి, తమ వైపు తిప్పుకుంటున్నారని తెలి పారు. బీఆర్‌ఎస్ నాయకులపై ప్రజలకు విశ్వసనీ యత లేదని, వాగ్దానాల అమలులో విఫలం చెం దారని అన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తల బలం తనకుందని అందరితో సమన్వయంగా ఉం టూ ముందుకు సాగుతానని, అందరి మద్దతుగా విజయం సాధిస్తానన్న నమ్మకం తనకుందని చెప్పారు. అనంతరం ఆవుల రాజిరెడ్డిని నాయ కులు, కార్యకర్తలు శాలువాలు, పూలమాలలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

వాహనాల తనిఖీలో నగదు పట్టివేత



నగదు స్వాధీనం చేసుకున్న పోలీసులు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని కోళపల్లి పాత టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టు వద్ద ఎలాంటి అనుమతి లేకుండా రూ.1 లక్షా 20 వేలు తరలిస్తున్న నగదును శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. మహారాష్ట్ర వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న వాహనంలో నగదు తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. ప్రజలు రూ.50 వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్తే అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు.

రైతులు దళారులను నమ్మకండి



ఐకేపీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మండల ప్రత్యేక అధికారి కృష్ణమూర్తి

మనోహరాబాద్(తూప్రాన్): రైతులు దళారులను నమ్మొద్దని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను విని యోగించుకోవాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పరిశ్రమల మేనేజర్ కృష్ణమూర్తి అన్నారు. శని వారం మండలంలోని పర్కిబండ, లింగారెడ్డిపేట్, రంగాయపల్లి, కూచారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులు ధాన్యం కొనుగోలు కేం ద్రాల్లోనే ధాన్యాన్ని అమ్మాలని అన్నారు. క్విం టాల్‌కు ఏ- గ్రేడ్ వరి రూ.2203, బి - గ్రేడ్ రూ. 2183 ధరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతు లకు ఇక్కట్లు కాకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి స్రవంతి, ఐకేపీ ఏపీఎం పెం టాగౌడ్, ఏఈఓలు సచిన్, నరేందర్, సీసీలు తది తరులున్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



కండువా కప్పుతున్న పద్మాదేవేందర్‌రెడి

చిన్నశంకరంపేట(మెదక్): ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు, చందంపేట ఎంపీటీసీ శివ కుమార్, గజగట్లపల్లి ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్ కాం గ్రెస్‌కు రాజీనామా చేశారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎ స్‌లో చేరారు. శనివారం మెదక్ బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎంపీటీసీలతో పాటు చందం పేట, రుద్రారం, టీ.మాందాపూర్ గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎ స్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు శివ కుమార్, ప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ.. ఆత్మగౌరవం చంపుకొని కాంగ్రెస్‌లో ఉండలేక బీఆర్‌ఎస్‌లో చేరామన్నారు.

రామాయంపేట(మెదక్): నార్సింగి మండల జెడ్పీటీసీ కృష్ణారెడ్డి శనివారం మండలంలోని వల్లూరు, భీంరావుపల్లి, నర్సంపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి తరఫున ప్రచారం నిర్వహిం చారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే గ్రామాలు మరింతగా అభివృద్ధి సాధిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు జెడ్పీటీసీతో పాటు మం డల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బాబు, గ్రామాల్లో ముఖ్యులను కలిసి మద్దతు కోరారు. నార్సింగికి చెందిన బీజేపీ బూత్ ఇన్‌చార్జి, ఇతర కార్యకర్తలు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరగా, దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి వారి మెడలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కేసీఆర్ మూడోసారి సీఎం కావాలి



మాట్లాడుతున్న ఏకే గంగాధర్‌రావు



రంగాయపల్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): కేసీఆర్ మూడోసారి సీఎం కావాలని, దాని కోసం అందరూ కృషి చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఏకే గంగా ధర్‌రావు కోరారు. శనివారం మండల కేంద్రం చిన్నశంకరంపేటకు వచ్చిన సందర్భంగా ఆయ నకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ కోసం అనేక అభివృ ద్ధి పనులు చేసిన సీఎం మూడోసారి కూడా గెలవాల్సిన అవసరం ఉందన్నారు. మెదక్‌లో పద్మాదేవేందర్‌రెడ్డిని గెలిపించి సీఎం కేసీఆర్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు మైనంపల్లి రాధాకి షన్‌రావు, ఏకే రమేశ్‌రావు, సురేశ్‌రావు, బీఆర్ ఎస్ మండలాధ్యక్షుడు పట్లోరి రాజు, ఆర్.అంజి రెడ్డి, లక్ష్మణ్, కుమార్‌గౌడ్, ఏమ వెంకటేశం ఉన్నారు.

గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని రంగా యపల్లి గ్రామంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పురం మహేశ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు ఓటు వేసి భారీ మేజార్టీతో గెలిపించాలని గ్రామస్తులను కోరారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు నాగభూ షణం, మహిపాల్‌రెడ్డి, నర్సయ్య, ఉప సర్పంచ్‌లు తుమ్మలరాజు, నవీన్‌చారి, శ్రీహరిగౌడ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ భిక్షపతి, నాయకులు రాహుల్‌రెడ్డి, రమేశ్, అంజనేయులు, జానగిరి, సాయి, ముస్తాఫా తదితరులున్నారు.

వరికోత యంత్రం బోల్తా



బోల్తాపడిన వరికోత యంత్రం

శివ్వంపేట(నర్సాపూర్): గుంతల రోడ్డు కారణంగా వరికోత యంత్రం అదుపు తప్పి బోల్తా పడింది. మండల పరిధి నవాబుపేట- గుమ్మడిదల ప్రధాన రోడ్డుపై శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. గుమ్మడిదల నుంచి గోమారం వైపు వస్తున్న వరి కోత యంత్రం(హార్వెస్టర్) రోడ్డు గుంతలు పడి, రాళ్లతేలి ఉండడంతో అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్‌తో పాటు అందులో ఉన్న మరో వ్యక్తి బయ టకు దూకేయడంతో వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.